క్లుప్తంగా

కష్టంలో ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు: కష్టంలో ఉన్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. గుంటూరు నగరంలోని 32 డివిజన్ జేసీఎస్ కన్వీనర్, పార్టీ సీనియర్ నాయకుడు రామరాజు నరసింహారావు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా, శనివారం వారిని నివాసానికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అంటేనే ఒక కుటుంబమని.. కుటుంబ సభ్యులకు ఎటువంటి సమస్య వచ్చినా.. కచ్చితంగా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ, పార్టీ నాయకులు బందా రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి కృషి చేయాలి

నెహ్రూనగర్: ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టి కృషితో నగరాభివృద్ధికి కృషి చేయాలని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు పేర్కొన్నారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా విధుల్లో చేరిన చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్ డి శ్రీనివాసరావు శనివారం నగర మేయర్‌ను సంపత్‌నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వీరు ఇరువురు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కలిశారు.

మొదటి అర్ధ సంవత్సర పన్ను చెల్లింపునకు 2 రోజులే గడువు

నెహ్రూనగర్: 2024-25 ప్రస్తుత అర్ధ సంవత్సరానికి ఆస్తి పన్ను చెల్లించడానికి ఈనెల 30 వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని, పన్ను చెల్లింపుదార్లకు సౌలభ్యం కొరకు క్యాష్ కౌంటర్లు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాలల్లోని క్యాష్ కౌంటర్లలో పన్ను చెల్లించడానికి ప్రత్యేక క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. నేడు ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ క్యాష్ కౌంటర్లు యథావిధిగా పని చేస్తాయన్నారు. కావున నగర పాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలం పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం



గుంటూరు మెడికల్: ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నీలం. మోహనార్జున్ చెప్పారు. గుండె ఆరోగ్యాన్ని కొన్ని దురలవాట్లు, జీవన విధానాలు దెబ్బతీస్తున్నాయని తెలిపారు. ఆధునిక కాలంలో అధికమైన గుండె జబ్బులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మానసిక ఒత్తిడి, ఆహార విషయంలో నిర్లక్ష్యం గుండె జబ్బులకు కారణమవుతుందని పేర్కొన్నారు. స్థానిక రైలు పేట బంగారమ్మ గుడి పక్కన మోహనార్జున్ హాస్పిటల్‌లో మధ్యాహ్నం 2.00 గంటల నుంచి 5:00 గంటల వరకు ఉచిత వైద్యశిబిరం జరుగుతున్నదన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి

నగరంపాలెం: సామాజిక ప్రయోజనం కోసమే మహాకవి గుర్రం జాషువా కవిత్వం రాశారని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ పేర్కొన్నారు. జాషువా జయంతి ఉత్సవాల్లో భాగంగా జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో శనివారం నగరంపాలెంలోని జాషువా విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ మహాకవి గుర్రం జాషువా జయంతిని జిల్లా ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకపోవడం బాధాకరమని వాపోయారు. కవితా విశారద, కవి కోకిల, కవి దిగ్గజ, నవయుగ కవి చక్రవర్తి వంటి అనేక బిరుదులు, పురస్కారాలను ఆయన్ను ఎన్నో వరించాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, నిర్వాహకులు పుసులూరి విజయ్‌కుమార్, హైకోర్టు న్యాయవాది చందవోలు శోభారాణి, కాపు నాయకులు మాదా రాధా, షేక్ జిలానీ, రాజపుత్ర సత్యంసింగ్, మెరిగల మణికుమార్, సంఘ సేవకులు బత్తుల కోటేశ్వరరావు, శంకూరి రాజారావు, పాగల్ల ప్రకాష్, ఎంజేజే ఎస్ అధ్యక్షులు పినపాటి మోహనరావు, గద్దం ఎలీషా, దాసరి జాన్ బాబు, జోసెఫ్ పాల్గొన్నారు.

అసమానతలపై కవిత్వం ద్వారా పోరుబాట

నెహ్రూనగర్: అసమానతలపై తన కవిత్వం ద్వారా పోరుబాట పట్టించిన పోరాట యోధుడు గుర్రం జాషువా అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం జాషువా జయంతిని పురస్కరించుకుని కాకుమానువారితోటలో జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనువాద భావజాలం తీవ్రంగా ఉన్నటువంటి పరిస్థితుల్లో తన కలాన్ని కత్తిగా చేసి కులవివక్షత, అంటరానితనం, స్త్రీ అణిచివేతలపై సుదీర్ఘ పోరాటం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జీఆర్ భగత్ సింగ్, సాదం సత్యనారాయణయాదవ్, పిడుగురాళ్ల సురేష్, ఘంటా ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.



జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో నివాళి..



ప్రభుత్వ మహిళా కళాశాలలో గుర్రం జాషువా చిత్రపటం నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ప్రభుత్వ మహిళా కళాశాలలో..

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల తెలుగు విభాగ ఆధ్వర్యంలో శనివారం నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ వి.మాధవి, అధ్యాపకులు డాక్టర్ ఎస్.విజయలక్ష్మి, డాక్టర్ డి.ధాత్రికుమారి, డాక్టర్ ఎస్.దివిజాదేవి, డాక్టర్ పి.విజయలక్ష్మి గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

స్వర్ణాంధ్ర ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో..

గుర్రం జాషువా దళిత వర్గానికి ఆధునిక మార్గదర్శి అని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏసుబాబు తెలియజేశారు. శనివారం గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని అమరావతి రోడ్డులోని సంఘ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమకాలీన సమాజంలో జరుగుతున్న అన్యాయాలను తన కవితత్వంతో ఎత్తి చూపించాడని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సుబ్బయ్యమాదిగ, మక్కెన ప్రభాకర్, రమణ, ప్రసాద్, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

తన బాల్యంలో కులపరంగా ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నప్పటికీ అవమానపడినప్పటికి తన కవితత్వంతో ఎదురుదాడికి దిగి తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు పొందిన కవి కోకిల గుర్రం జాషువా అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ పేర్కొన్నారు. జాషువా జయంతిని పురస్కరించుకుని నగరంపాలెంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పారేపల్లి మహేష్, కొల్లూరి హనుమంతరావు, కొల్లిపర వెంకటేష్ పాల్గొన్నారు.

కవి చక్రవర్తి జాషువాకు నివాళి

గుంటూరు ఎడ్యుకేషన్: జీవితంలో తనకు ఎదురైన అవమానాలను చిరునవ్వుతో స్వీకరించిన జాషువా కృషి, పట్టుదలతో కవి చక్రవర్తిగా ఎదిగారని ప్రభుత్వ మహిళా కళాశాల విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల తెలుగు విభాగ ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భానుమురళి, తెలుగు విభాగాధిపతి జీవీ సుధీర్‌కుమార్, ఆర్.జయశైలజ, డాక్టర్ పి.దేవేంద్రగుప్తా, మేజర్ పి.కుమార్ రాజా పాల్గొన్నారు.

ఆపరేషన్‌తో కామెర్ల వ్యాధికి చెక్‌పెట్టారు

గుంటూరు మెడికల్: కామెర్ల వ్యాధితో బాధపడే రోగికి గుంటూరు జీజీహెచ్ సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడారు. ఆపరేషన్ కు సంబంధించిన వివరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మీడియాకు వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం చెందిన ఎం.వెంకటేశ్వరరావు కామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడు. విజయవాడలోని పలు ప్రైవేట్ హాస్పిటల్ చుట్టూ తిరిగిన ఫలితం కనిపించలేదు. ఆపరేషన్‌కు అయ్యే ఖర్చు దాదాపు 7 నుంచి 10 లక్షల వరకు ఖర్చవుతుంది అని ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు చెప్పారు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ ఓపీకి వెంకటేశ్వరరావు నెల రోజుల క్రితం వచ్చాడు. డాక్టర్ అందే వెంకటేశ్వరరావు రోగికి వివిధ పరీక్షలు చేసి కామెర్లు తగ్గటానికి ఒక స్టెంట్ ను పేషెంట్‌కు అమర్చారు. ఈ వ్యాధి మరింత ముదరటం, అప్పుడప్పుడు జ్వరం రావడం, కడుపు నొప్పి రావడం వంటి సమస్యలు రావటంతో ఆపరేషన్ చేయకపోతే పేషంటుకు ప్రాణాపాయం ఉందని వైద్యులు గుర్తించారు. ఆపరేషన్ చేసే సమయంలో ప్రాణానికి కూడా హాని ఉందని రోగి బంధువులకు కౌన్సెలింగ్ చేసి పదిరోజుల క్రితం విజయవంతంగా ఆపరేషన్ చేశారు. ఈ ఆపరేషన్‌లో డాక్టర్ కోటి వెంకటేశ్వర్లుతో పాటుగా డాక్టర్ సత్యదేవ్, డాక్టర్ వంశీ అనస్థీషియా వైద్యులు డాక్టర్ పోలయ్య, డాక్టర్ శాంసన్ దేవ్, డాక్టర్ శ్వేత, డాక్టర్ దీప్తి శాలిని పాల్గొన్నారు.

భగత్ సింగ్‌కు ఘన నివాళి

లక్ష్మీపురం: స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో శనివారం భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. కొత్తపేట కూడలిలోని భగత్ సింగ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య, అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, మోగాచార్యులు అచ్యుత్ ఇందుశేఖర్, చంద్రయ్య, ఎం.ప్రసాదరావు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని భవనాలకు ఓసీ నిలుపుదల

నగర కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో బహుళ అంతస్తు నిర్మాణాలు సెట్ బ్యాక్ పోర్షన్‌లో జనరేటర్లు, ఇతర నిర్మాణాలు చేపట్టకూడదని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేసిన భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) జారీ చేయబోమని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శనివారం కమిషనర్ ఐపీడీ కాలనీ, బుడంపాడు, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘన చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా సెట్ బ్యాక్ పోర్షన్‌లో ఏ విధమైన నిర్మాణాలు చేయకూడదని, జనరేటర్లు పెట్టడానికి వీలు లేదన్నారు. ర్యాంప్‌లు రోడ్ మీద వరకు రాకూడదని, గ్రీనరీకి కేటాయించిన విధంగా ఉండాలని ఆదేశించారు. వాచ్ మెన్ రూమ్ నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట సిటీ ప్లానర్ డి.రాంబాబు, డెప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ అజయ్ కుమార్, టీపీఎస్‌లు సువర్ణ కుమార్, రసూల్, ఎంహెచ్‌ఓ రామారావు, డీఈఈ శ్రీధర్, ఏఈ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో సమావేశం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో మౌలిక వసతులు లేని, పాత భవనాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను మార్పు చేయడానికి సిద్ధం చేసిన ప్రతిపాదనలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించినట్లు తూర్పు నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్ఓ), నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం కమిషనర్ చాంబర్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025 పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తూర్పులో 250 నుంచి 256కు, పశ్చిమలో 282 నుంచి 291కి పోలింగ్ కేంద్రాలు పెరిగాయన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్, పశ్చిమ ఈఆర్ఓ సీహెచ్.ఓబులేసు, ఏఈఆర్ఓలు సీహెచ్.శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, రాంబాబు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎల్.పద్మ, డెప్యూటీ తహసీల్దార్లు నాగ మల్లేశ్వరరావు, భాస్కర్, నాయకులు డి.జాన్ బాబు (వైఎస్సార్ సీపీ), నాయుడు ఓంకార్(టీడీపీ), పద్మనాభరావు(బీజేపీ), సీహెచ్ వాసు(బీఎస్పీ), ఎస్.కె.ఖాసిం (సీపీఎం), టి.సేవా కుమార్(ఆమ్ ఆద్మీ పార్టీ) పాల్గొన్నారు.



ప్లాన్‌ను పరిశీలిస్తున్న నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

ఔషధ సూత్రీకరణ, విశ్లేషణ సాధనాలపై వర్క్‌షాప్

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఔషధ సూత్రీకరణ, విశ్లేషణ సాధనాలపై ఫార్మాస్యూటికల్ ఎనాలసిస్, ఫార్మాస్యూటిక్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం వర్క్‌షాప్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం తెలిపారు. వర్క్‌షాప్‌కు ఏఎన్‌యూ కెమిస్ట్రీ విద్యార్థులకు కళాశాల ఫార్మాస్యూటికల్, ఫార్మాస్యూటిక్స్ విభాగాధిపతులు డాక్టర్ పి.నాగరాజు, డాక్టర్ వి.వాసునాయక్ హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ఫార్మా.డి డైరెక్టర్ పి. సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర ఎ.ప్రత్యూష పాల్గొన్నారు.

సివిల్ సప్లయీస్ కార్మికుల ఆందోళన విరమణ

లక్ష్మీపురం: మూడు రోజులుగా సివిల్ సప్లయీస్ కార్మికులు చేపట్టిన ఆందోళనను మంత్రి నాదెండ్ల మనోహర్ హామీతో విరమించినట్లు ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు శనివారం తెలిపారు. కూలీ రెట్ల ఎగ్రిమెంట్ కాలపరిమితి ముగిసి 9 నెలలు పూర్తయినప్పటికీ నూతన కూలీరేట్ల జీవోను విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లయీస్ అధికారులు తీవ్ర జాప్యం చేయటంపై అలాగే పని భద్రత కల్పించాలని, ప్రతి నెల పదో తేదీ కల్లానెల బిల్లులు చెల్లించాలనికోరుతూ కార్మికులు ఆందోళన బాట చేపట్టడం జరిగిందని చెప్పారు. ఈ నేపథ్యంలో కార్మిక సమస్యల పరిష్కరించాలని కోరుతూ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఏఐటీయూసీ యూనియన్ నాయకత్వం కలవటం జరిగిందన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ కార్మిక సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తామని త్వరలోనే జీఓ విడుదల చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. మంత్రి ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం జరుగుతున్న ఆందోళన వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు కోట్ల మరియదాసు, దానం, వినుకొండ డేవిడ్, సురేష్, జాన్ బాబు, కాంతారావు, బుజ్జి మరియు బాబు పాల్గొన్నారు.

ఖో-ఖోలో విజ్ఞాన్ స్కూల్ విద్యార్థినుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: హైదరాబాదు బాచుపల్లిలోని విజ్ఞానజ్యోతి పాఠశాలలో ఈనెల 22 నుంచి 25 వరకు జరిగిన సీబీఎస్‌ఈ ప్రాంతీయ చాంపియన్‌షిప్‌లో భాగంగా ఖో-ఖో టోర్నమెంట్‌లో ప్రతిభ చూపిన ఎల్ఐసీ కాలనీలోని విజ్ఞాన్ పాఠశాల విద్యార్థినులు తృతీయస్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య బృందావన్‌గార్డెన్స్‌రోడ్డులోని నివాసంలో విద్యార్థినుల బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ ఆనంద్ పాల్గొన్నారు.



విద్యార్థినులతో లావు రత్తయ్య

విద్యార్థి ఆత్మహత్య

లక్ష్మీపురం: ప్రేమ ఫలించక పోవడంతో ఓ విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. పొన్నూరు నియోజకవర్గం తాళ్ళపాలెం గ్రామానికి చెందిన పాకల లక్ష్మయ్య కుమారుడు పాకల శ్రీనివాసరావు(22) డిగ్రీ పూర్తి చేసుకున్నాడు. టైపు నేర్చుకునేందుకు గుంటూరుకు వచ్చి గుంటూరు అరండల్‌పేట 3/1లో ఎస్.వి.ఫిల్ హౌస్ హాస్టల్‌లో ఉంటున్నాడు. ప్రేమించిన యువతి పెళ్లికి అంగీకరించక పోవడంతో శ్రీనివాసరావు ఈనెల 24వ తేదీన హాస్టల్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేశాడు. దీన్ని గమనించిన హాస్టల్ నిర్వాహకులు, తోటి స్నేహితులు ప్రభుత్వ సమగ్రాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. శనివారం శ్రీనివాసరావు మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆత్మహత్య కింద కేసు నమోదు చేశారు.

అన్ని మతాల వారు వెంకటేశ్వర స్వామిని ఆరాధిస్తారు

గుంటూరు మెడికల్: హిందువులు మాత్రమే కాకుండా అన్ని మతాలు వారు వెంకటేశ్వర స్వామిని ఆరాధిస్తారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ అన్నారు. శనివారం స్థానిక చంద్రమౌళినగర్‌లో జరిగిన విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి రామకష్టారెడ్డి, నాయకులు పి.రవికుమార్, సీహెచ్ తిరుపతిరావు, ప్రతాప్ ప్రసాద్, కె.బ్రహ్మయ్య, వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లించవచ్చు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు నగరం, సీఆర్‌డీఏ సర్కిల్ పరిధిలోని విద్యుత్ బిల్లులు ఆదివారం చెల్లించేలా ప్రత్యేక కౌంటర్లు పనిచేస్తాయని విద్యుత్ పర్యవేక్షణ ఇంజినీర్ పి.విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, సీఆర్‌డీఏ సర్కిల్స్ పరిధిలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలలోని కౌంటర్లు అందుబాటులో ఉంటాయన్నారు.

ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలపై పోరాడుదాం

లక్ష్మీపురం: భగత్ సింగ్ స్ఫూర్తితో ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడదామని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయకార్యదర్శి మహంకాళి సుబ్బారావు పేర్కొన్నారు. భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకుని కొత్తపేట మల్లయ్య లింగం కార్యాలయం వద్ద నుంచి భగత్ సింగ్ విగ్రహం వద్దకు ర్యాలీ నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ నూతన విద్యా విధానం-2020కు వ్యతిరేకంగా, రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు ఉద్యమించాలని కోరారు. అదే విధంగా రాష్ట్రంలో ఉద్యోగాలు, సరైన విద్య అందక అనేకమంది ఇబ్బందులు పడుతుంటే కూటమి ప్రభుత్వం మాత్రం లడ్డు చుట్టూ రాజకీయం చేస్తుందని మండిపడ్డారు. దీనివలన మతం పేరుతో మనుషుల మధ్య వైషమ్యాలు నెలకొంటాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగాల చైతన్య, షేక్ వలి, మాజీ నాయకులు బి.వెంకటేశ్వర రెడ్డి, ఆకిటి అరుణ్ కుమార్, జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, యశ్వంత్, డేవిడ్ గౌతమ్, ఖాసీం వలి, జానీ, కిరణ్, సాంబ, సతీష్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దిన నాగేశ్వరరావు



గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలలో విద్యార్థిగా జీవితాన్ని ప్రారంభించి ఇక్కడే అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఇంటూరి నాగేశ్వరరావు విద్యారంగానికి విశేష సేవలు అందించారని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. శనివారం జేకేసీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ ఇంటూరి నాగేశ్వరరావుకు సన్మాన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ కళాశాలలో చదివిన ఎంతో మంది పూర్వ విద్యార్థులు ఉన్నత రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్ మాట్లాడుతూ మారుతున్న కాలంతో పాటు చదువును, క్రమశిక్షణను కలగలిపి విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దిన నాగేశ్వరరావు సేవలను గుర్తుంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, పూర్వ విద్యార్థుల సంఘ కార్యదర్శి చుక్కపల్లి రమేష్, డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ ఆర్కే ప్రసాద్, కళాశాల స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ రామ్‌ప్రసాద్, కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.


■ హిందూ కాలేజీలో అధిక ఫీజులు వసూలు అన్యాయం

లక్ష్మీపురం: గుంటూరు నగరంలో ఉన్నటువంటి హిందూ కాలేజీలో అధిక ఫీజులు వసూలు చేయటం దారుణం అని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.యశ్వంత్, షేక్ సమీర్ అన్నారు. స్థానిక హిందూ కళాశాలలోని శనివారం ఎస్ఎఫ్ఐ సంఘం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హిందూ కాలేజీ ఫీజు ప్రతి సంవత్సరానికి రూ.18,000 నిర్ణయించి అలాట్మెంట్ లెటర్లో ఇచ్చారు. కానీ కాలేజీ యాజమాన్యం మాత్రం ప్రతి సంవత్సరం విద్యార్థి దగ్గర నుంచి 25,000 కట్టాలని ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. ఐదో సెమిస్టర్, మూడో సెమిస్టర్ పరీక్ష ఫీజు కట్టే సమయంలో మొత్తం కాలేజీ ఫీజు చెల్లించాలని కాలేజీ యాజమాన్యం విద్యార్థులను ఒత్తిడి చేస్తుందని చెప్పారు. ఈ విషయాన్ని వెంటనే కాలేజీ యాజమాన్యం కలగజేసుకొని విద్యార్థులు పరిష్కారం చూపాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సుచరిత పాల్గొన్నారు.

■ వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

పట్నంబజారు: వృద్ధురాలి మెడలోని గొలుసు చోరీ ఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. విజయవాడకు చెందిన వృద్ధురాలు ఇమ్మడి ధనలక్ష్మి ఈనెల 27వ తేదీన విజయవాడ నుంచి చిలకలూరిపేట బయల్దేరింది. గుంటూరులో బస్సు దిగి చిలకలూరిపేట బస్సు ఎక్కుతున్న సమయంలో మెడలోని మూడు సవర్ల గొలుసు గుర్తుతెలియని వ్యక్తి తెంచుకుపోయాడు. బాధితురాలి కుమారుడు శివరామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

■ మాదక ద్రవ్యాలతో జీవితాలు దుర్భరం



నగరంపాలెం: మాదకద్రవ్యాల వాడకంతో జీవితాలు దుర్భరంగా మారతాయని తూర్పు డీఎస్పీ అబ్దుల్ అజీజ్ అన్నారు. లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నల్లచెరువు 23/2 అడ్డరోడ్డులో శనివారం రాత్రి 'వారధి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పు డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలను అలవాటు చేసుకోవద్దని అన్నారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఏదైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ శివప్రసాద్ పాల్గొన్నారు.

■ చిట్స్ బాధితుల ధర్నా

లక్ష్మీపురం: చిట్స్ పేరుతో స్థానికుల నుంచి సుమారు రూ.కోటికి పైగానే వసూలు చేసుకుని ఉన్న ఇంటిని విక్రయించి కుటుంబ సభ్యులతో పరారైన ఘటనలో బాధితులు ఆమె ఇంటి ముందు శనివారం ఆందోళనకు దిగారు. వివరాలు స్థానిక చైతన్యపురి కాలనీ మెయిన్ రోడ్డు ప్రాంతానికి చెందిన మారెడ్డి చంద్రావతి, స్థానిక మహిళలతో చిట్స్ నిర్వహించింది. చిట్ చివరకు వచ్చే సరికి నగదు తిరిగి చంద్రావతి సంబంధిత మహిళలకు చెల్లించాల్సి ఉంది. అయితే సభ్యులకు ఎవరికి నగదు చెల్లించడంలో జాప్యం చేస్తోంది. దీంతో మహిళలు ఇదేంటి అన్ని నిలదీయగా రేపు మాపు అంటూ కాలయాపన చేసింది. ఇదిలా ఉంటే చంద్రావతి చిట్ సభ్యులకు ఎవరికి నగదు చెల్లించకుండానే నివాసం ఉంటున్న ఇంటిని వేరే వారికి విక్రయించి కుటుంబ సభ్యులతో సహా పరారైంది. దీంతో బాధిత మహిళలు దిక్కుతోచక అరండల్‌పేట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా పోలీసులు ఈనెల 25న రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే శనివారం బాధిత మహిళలు చంద్రావతి నివాసం ఉన్న ఇంటి వద్దకు భారీగా చేరుకుని ఇంటి ముందు బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను నచ్చ చెప్పి దర్యాప్తు ముమ్మరం చేస్తామని చెప్పడంతో అక్కడ నుంచి తిరిగి వెళ్లారు.